క్లుప్తంగా

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ప్రభాకర్ తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతినెలా స్వాతి నక్షత్రం రోజున ప్రత్యేక పూజలు చేస్తామని పూజారి మధుసూదనాచారి, చైర్మన్ ప్రభాకర్‌ల తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు శ్యాం, చంద్రయ్య, ప్రభాకర్, ఉపాసకురాలు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదవాలి: డీఈఓ


ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న డీఈఓ

కోహెడ(హుస్నాబాద్): ఒత్తిడికి లోనుకాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక హైస్కూల్‌ను మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట ఏంఈఓ పద్మయ్య ఉన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికుల ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు మరమ్మతులలో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహించిన బేగంపేట గ్రామస్తులు మంగళవారం రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంపూర్తి పనుల వల్ల వాహనదారులు, స్థానికులు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు శేఖర్‌బాబు, లక్ష్మయ్య, పోచయ్య, నాగరాజు, కమలాకర్‌రెడ్డి, సంపత్, మైనయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి: ఎస్ఎఫ్ఐ


మాట్లాడుతున్న సంజీవ్ కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్ డిమాండ్ చేశారు. చిన్నకోడూరు జూనియర్ కళాశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా సమీర్, కార్యదర్శిగా అక్షిత్, ఉపాధ్యక్షుడిగా చరణ్, కార్యదర్శులుగా విష్ణు, హరీశ్, శ్రీకాంత్, సౌమ్య తదితరులు నియమితులయ్యారు.

ప్రలోభాలకు గురిచేయొద్దు


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తొగుట(దుబ్బాక): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవికాంత్‌రావు హెచ్చరించారు. మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం ప్రజలకు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను అడ్డంపెట్టుకుని గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. గ్రామంలో అనుమానాస్పదంగా సంచరించే వారి సమాచారం 100కు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శత శాతం.. లక్ష్యం

- ఇంటి పన్ను వసూళ్లకు ప్రత్యేక చర్యలు
- వసూలైనవి రూ.1.15 కోట్లు..
- మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశం
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలో వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విలీన గ్రామాలైన చెల్లాపూర్, దుంపలపల్లి, ధర్మాజీపేట, లచ్చపేట, చెర్వాపూర్‌తోపాటు దుబ్బాకను కలుపుకుని మొత్తం 6,208 ఇళ్లు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.1.15 కోట్ల పన్నులు వసూళ్లు చేయగా.. ఇంకా రూ.88 లక్షలు పెండింగ్‌లో ఉంది. వాటిని మార్చిలోగా వసూలుచేసి జిల్లాలోనే దుబ్బాక మున్సిపల్‌ను ముందు వరుసలో ఉంచేలా మున్సిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇప్పటి వరకు 57 శాతం పన్నులు వసూలయ్యాయి.

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు

పన్నులు కట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్న బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే చట్ట ప్రకారం ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చెల్లించే పన్నులతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని సిబ్బంది ఇంటింటికీ తిరిగి యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. అందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సైతం అందులో పాల్గొని స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు.


స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం



మున్సిపల్ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమవుతుంది. ప్రజల్లో పన్ను చెల్లింపులపై అవగాహన పెరిగింది. ఈ యేడాది పన్నుల వసూలు ప్రక్రియ పూర్తి చేస్తాం. వంద శాతం పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

3.30 క్వింటాళ్ల నిబంధనతో ఇబ్బంది

- ఎకరాకు 7 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేయాలి
- మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ఎకరాకు 3.30 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేయాలనే నిబంధన రైతుల దినుసు అమ్ముకొనేందుకు అడ్డు వస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుల కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కారించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయకపోవడంతో రైతులు మార్కెట్‌కు వచ్చి తిరిగిపోవాల్సి వస్తోందని, రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెప్పారు. మెట్ట ప్రాంతంలో కందులు ఎకరాకు 7 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావడంతో మార్క్‌ఫెడ్ పెట్టి 3.30 క్వింటాళ్ల నిబంధన రైతులకు తలనొప్పిగా మారిందని వాపోయారు. చాలా మంది రైతులు ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోలేదని, తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తో పంట కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతులకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ చందు, కార్యదర్శి ప్రభాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అధికారులూ.. రుణాల లక్ష్యం చేరుకోండి

హుస్నాబాద్‌రూరల్: సంక్షేమ పథకాలు, స్వశక్తి సంఘాల రుణాలు, బ్యాంకుల వ్యాపార అభివృద్ధిపై ఐఓసీ కార్యాలయంలో మంగళవారం లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ హరిబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధితో పాటు స్వయం ఉపాధి పొందే మహిళలు, యువతకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరుకల్లా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పీఎంఈజీపీ, ఎంపీ విశ్వకర్మ, పీఎం స్వనిధి, పీఎంఎఫ్ఎంఈ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని, వ్యాపారరంగంలో మహిళలను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో నాబార్డు డీడీఎం నిఖిల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, రాజలింగం, బ్లాక్‌లో ఆరు మండలాల బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మలబార్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థినులు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను ఎంపికైన విద్యార్థినులకు రూ.10వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. వారిలో యాట అశ్విని, గదరాజు పల్లవి, కాసార్ల అనుష్క, కెమ్మసారం బాలలక్ష్మి, బాలగోని మహాలక్ష్మి, మల్లం శిరీష, నీల అర్చన, యాసవేని రాజేశ్వరి, సైని ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మధు, అధ్యాపకులు పరశురాములు, విద్యాసాగర్, శ్రీధర్, రవి, కవిత, స్వప్న, శ్రీదేవి, శ్యామ్‌సుందర్, చంద్రమోహన్, అనూష, రేవతి, సంపత్, సిబ్బంది స్వప్న, మహేందర్, బాబు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

నీటి తరలింపుపై అధికారుల కొరడా

సాక్షి ఎఫెక్ట్..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్ గ్రామంలోని నల్ల చెరువులో అక్రమంగా తరలిస్తున్న నీటి ప్రక్రియను అధికారులు మంగళవారం పరిశీలించారు. సాక్షిలో 13వ తేదీన 'అక్రమ నీటి తరలింపును అరికట్టాలి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రవి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా మోటారు, పంపుల సాయంతో చెరువులో నీటిని తరలిస్తున్నారని, ఆ మోటారు, స్టార్టర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే గ్రామాల్లోని చెరువు, కుంటల్లో మోటార్లు వేసి నీటి తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


మోటారు, స్టార్టర్లను తీసుకువెళ్తున్న అధికారి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

న్యాయమూర్తి కృష్ణతేజ

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆ సేవలను వినియోగించుకోవాలని మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి కృష్ణతేజ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. పేదల కోసమే ప్రభుత్వం హాస్పిటల్స్ నిర్మించిందని, సేవలు సక్రమంగా అందకపోతే ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఆయన వెంట వైద్యుడు జయంత్, న్యాయవాది మురళీమోహన్ తదితరులు ఉన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ

నిధులు మంజూరు చేయించండి సారూ..

పంచాయతీ కార్యదర్శుల వినతి

గజ్వేల్‌రూరల్: గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులకు సంబంధించిన నిధులు విడుదలయ్యేలా చూడాలని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు కోరారు. మంగళవారం ఎంపీడీవో ప్రవీణ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ రకాల పనులకు సంబంధించి బిల్లులు గత ఆగస్టు నుంచి ఐఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పంచాయతీల నిర్వహణకు అవసరమైన నిధులను నేరుగా టీఎస్ టీపీఏఎస్ఎస్ ఖాతాకు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో అప్రమత్తం

డీఆర్‌డీఏ పీడీ జయదేవ్‌ఆర్య

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధి పనుల కల్పనలో అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్‌ఆర్య అధికారులకు సూచించారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. గుగ్గిల్ల, గాగిల్లాపూర్ లింక్ రోడ్డు, జీపీలోని రికార్డులు పరిశీలించారు. జాబ్‌కార్డులు వందలలో ఉన్నప్పటికీ కూలీలు రాకపోవడంపై ప్రశ్నించారు.

అదనపు పీడీ తనిఖీ

బేగంపేట, వరాపూర్‌లో అదనపు పీడీ శ్రీనివాస్ గౌడ్ తనిఖీ చేశారు. పనుల పురోగతిని పరిశీలించారు. వేసవిలోను కూలీలకు పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజబాబు, టీఏ నవీన్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవితానికి దివ్యౌషధం 'ధ్యానం'

ఏసీపీ పురుషోత్తం రెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆరోగ్యకరమైన జీవితానికి ధ్యానం దివ్యమైన ఔషధం లాంటిదని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోమటిబండ శివారు(ధర్మారెడ్డిపల్లి)లో గల శ్రీపాండవ కృష్ణ ధ్యాన క్షేత్రం సప్తమ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో మానసిక సమస్యలు తలెత్తినపుడు ప్రారంభ దశలోనే చికిత్స చేయించుకుంటారన్నారు. మనం అలాంటి సమస్యలు తెలిత్తినపుడు సంకోచిస్తామని, ఈ ధోరణిని మానుకోవాలని సూచించారు. పని ఒత్తిడితో సతమతమయ్యే ప్రజలు కొంత సమయం ధ్యానానికి కేటాయించాలని సూచించారు. అనంతరం పీఎస్ఎస్ఎం గజ్వేల్ శాఖ అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ మహాలయ పిరమిడ్ ట్రస్టు ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, సభ్యులు బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడం, అలాగే సమస్యలు తెలుసుకోవడం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఏసీపీ తెలిపారు. మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీని ద్వారా ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. నార్కోటిక్స్ డాగ్స్‌తో అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పేపర్లు లేని 28 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపులపై దాడులు చేసి 25 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు చంద్రమోహన్, విజయ్‌కుమార్, దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాలలో ..

చేర్యాల(సిద్దిపేట): స్థానిక పెద్దమ్మగడ్డ ప్రాంతంలో సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఎలాంటి పేపర్లు లేని 52 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి ఎస్ఐలు నీరేశ్, షేక్ మహబూబ్, రాజు, ప్రొబెషనరీ ఎస్ఐ మానస రెడ్డి, పోలీసు, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మద్దూరు(హుస్నాబాద్): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఇంత వరకు చేయించుకోని వారి కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ రామ్మోహన్ తెలిపారు. 28 వరకు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.14,500 జరిమానా, వారిలో ఒకరికి ఐదు రోజులు, మరొక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

పన్నులు చెల్లించకపోతే చర్యలు

గజ్వేల్‌రూరల్: గృహ, వాణిజ్య, వ్యాపార సముదాయాల నిర్వాహకులు నల్లా, ఇంటి పన్నులు చెల్లించని వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, బిల్లు కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారంలోగా పెండింగ్‌లో ఉన్న పన్నులు, బిల్లులను చెల్లించేలా చూడాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల గొంతుకనవుతా

ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ, అధ్యాపక గొంతుకనవుతానని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ యూటీఎఫ్ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ యూనియన్‌ల ప్రతినిధులు విజేందర్ రెడ్డి, నరేందర్, యాదగిరి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్

టీపీటీఎఫ్ ఇంటింట ప్రచారం

చేర్యాల(సిద్దిపేట): ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో ఇంటింటికీ తిరిగి ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట రాంరెడ్డి, ప్రశాంత్‌కుమార్, వెంకటరమణ, రాజు, హన్మారెడ్డి, చంద్రా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, ఐలయ్య, కొండల్‌రెడ్డి, నరహరి, స్వరూపరాణి, గోవింద రాజులు పాల్గొన్నారు.

నిరుద్యోగులే బుద్ధి చెబుతారు

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో నిరుద్యోగులు, పట్టభద్రులు ఉద్యోగులు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని బీజేపీ ప్రభారిలు వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బెజ్జంకితో పాటు మండలంలోని వీరాపూర్, బేగంపేట గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయును మద్దతు కోరారు. ఆయా కార్యక్రమాలలో రాజు, మహిపాల్ రెడ్డి, వేణు, సత్తిరెడ్డి, మల్లేశం, సుధీర్‌రావు, శ్రీధర్ రావు, లవణ్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ముద్దుబిడ్డ హరికృష్ణ

హుస్నాబాద్: విద్యావేత్త, బలహీన వర్గాల ముద్దుబిడ్డ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు కొమురయ్య కోరారు. హుస్నాబాద్‌లో బహుజన సంఘాల నాయకులతో కలిసి పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం

హుస్నాబాద్‌రూరల్: పట్టభద్రులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక గ్రంథాలయం దగ్గర పట్టభద్రులను కలిసి మాట్లాడారు. అంజిరెడ్డి గెలిస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తారని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీకి లబ్ధి చేసేందుకే బీఆర్ఎస్ దూరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేయడం లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట అధ్యక్షుడు అత్తు ఇమామ్ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అధికారంలోకి రావడం అసాధ్యం అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధు, గయాజొద్దీన్, సలీం, అనిల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాలిపోయిన ఈతచెట్ల పరిశీలన

గజ్వేల్‌రూరల్: ఈత చెట్లను దహనం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో ఇటీవల ఈతచెట్లు కాలిపోయినట్లు ఆ గ్రామ గౌడసంఘం సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన పరిశీలించారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

◆ భాగ్యరెడ్డి వర్మ సేవలు మరువలేనివి

గజ్వేల్‌రూరల్: విద్య విప్లవాన్ని సృష్టించిన భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివని దళిత ప్రజాసంఘాల నాయకులు అన్నారు. హిందూ ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డివర్మ 86వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు మాట్లాడారు. నాయకులు మైసయ్య, శ్రావణ్, లింగం, శేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రోగ్రాం మేనేజర్ తనిఖీ

సిద్దిపేటకమాన్: ప్రజలకు అందుబాటులో ఉండి అత్యవసరంలో ప్రభుత్వ ఆసుపత్రులకు చేర్చాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ అంబులెన్స్ నిర్వాహకులకు సూచించారు. సిద్దిపేటలోని 108, 102 అంబులెన్స్ వాహనాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల్లోని రికార్డులను పరిశీలించారు. అంబులెన్సుల ద్వారా గర్భిణులకు అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన

దుబ్బాకరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలపై పోలీసులు మండలంలోని అప్పనపల్లిలో మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ గంగరాజ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలని, ఎలాంటి గొడవలకు దిగ కూడదన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించవద్దని, సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

◆ సమస్యల పరిష్కారంలో విఫలం

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ డివిజన్ 17వ మహాసభల సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,300 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. కార్యక్రమంలో ప్రవీణ్, హరికృష్ణ, అరుణ్, లోకేశ్, బన్ని, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రింటర్ అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మాజీ ఉపసర్పంచ్ ఎలుకంటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రింటర్ అందజేశారు. విద్యార్థుల పోటీ పరీక్షలు, పాఠశాల అవసరాల కోసం ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో అందజేశానని ఆయన తెలిపారు. హెచ్ఎం తిరుపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవయ్య, సంపత్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికుడి కుటుంబానికి చేయూత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిలో ఇటీవల పంచాయతీ కార్మికుడు తాడూరి నర్సయ్య మృతి చెందగా ఆయన కుటుంబానికి గ్రామస్తులంతా కలిసి మంగళవారం రూ.7,700 ఆర్థిక సాయం అందజేశారు. నర్సయ్య గ్రామం కోసం అలుపెరుగని సేవలు చేశాడని కొనియాడారు.

◆ తహసీల్దార్‌కు సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని పలువురు నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్దిని రాజమల్లయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి బాల నర్సింహులు, ఉపాధ్యక్షుడు సిద్దిని పెద్ద రాజు, సీనియర్ నాయకుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.